


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 06-06-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 231 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ముస్లిం సోదరులకు ఆత్మీయ శుభాభినందనలు

### సత్యనిష్ఠ, సత్ప్రవర్తనకు ప్రతీక రంజాన్



అమరావతి: రంజాన్ పర్వదినం సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. దీక్షలు, ఉపవాసాలు, దైవారాధన, దానధర్మాలు, చెడును త్యజించడం, మానవ సేవ వంటి సత్కార్యాల ద్వారా భగవంతుని స్మరణలో తరించే ఈ రంజాన్ రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు కలిగించాలని ఆకాంక్షించారు. పవిత్ర ఖురాన్ గ్రంథం దివి నుంచి భువికి దిగివచ్చిన శుభ సమయం రంజాన్ అని తెలిపారు. నమాజ్, కలిమా, రోజా, జకాత్, హజ్ అనే ఐదు అంశాలతో భగవంతునికి

తరువాయి 2లో..

## జూలై 5న కేంద్ర బడ్జెట్



- ఉద్యోగాల కల్పనపై ప్రధాన దృష్టి
- ప్రత్యక్ష పన్నుల సరళీకరణపై కసరత్తు
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- జూన్ 17 నుంచి జూలై 26 వరకూ లోక్‌సభ సమావేశాలు

న్యూఢిల్లీ: మౌలిక వసతుల కల్పన, ఉద్యోగాల కల్పనపై 2019 కేంద్ర బడ్జెట్‌లో ప్రధానంగా దృష్టి సారించనున్నారు. బడ్జెట్ సమర్పణకు మరో 30 రోజులు మాత్రమే ఉండటంతో బడ్జెట్ సన్నాహకాలు ముమ్మరంగా సాగుతున్నాయి. బడ్జెట్‌లో చేర్చాల్సిన అంశాలకు సంబంధించి కొత్త ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన అధికారులతో చర్చల ప్రక్రియ కొనసాగుతోంది. ప్రత్యక్ష పన్నుల సరళీకరణపై కూడా ఈసారి బడ్జెట్‌లో ప్రధానంగా దృష్టి సారించనున్నట్టు తెలుస్తోంది. కాగా, లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ 17 నుంచి జూలై 26 వరకూ జరగున్నాయి. జూలై 5న బడ్జెట్ సమర్పణ జరుగుతుంది. బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక సర్వేను కూడా సభలో ప్రవేశపెడతారు. బడ్జెట్‌లోని అంశాలు బయటకు పొక్కకుండా ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యాలయంలోకి ఇతరుల ప్రవేశంపై ఆంక్షలు అమల్లోకి తెచ్చారు.

## ఏపీ అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా అప్పల నాయుడు?



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఈనెల 12న శాసనసభ తొలి సమావేశాలు ప్రారంభం కానున్నట్లు సమాచారం. ప్రొటెం స్పీకర్‌గా విజయనగరం జిల్లాకు చెందిన వైకాపా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు నియమితులయ్యే అవకాశముంది. బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఇప్పటికి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన అనంతరం శాసనసభ సమావేశాల తొలిరోజున కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయిస్తారు. ఆతర్వాత శాసనసభ స్పీకర్ ఎన్నికను కూడా నిర్వహించాల్సి ఉంటుంది. కొత్తగా ఎన్నికైన శాసనసభాపతికి పదవీ బాధ్యతలు అప్పగించిన

తరువాయి 2లో..

## నీట్ ఫలితాలు విడుదల



దిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) 2019 ఫలితాలు

తరువాయి 2లో..

## 10 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా ఏసీ కోచ్‌లు!

### ప్రయాణీకులకు చల్లని సేవలు దక్షిణ మధ్య రైల్వే

సికింద్రాబాద్: పది ఎక్స్‌ప్రెస్ రైళ్లలో త్వరలోనే అదనంగా ఓ ఏసీ త్రీటైర్ కోచ్ ఏర్పాటు కానుంది. ఆయా రైళ్లలో శాశ్వతంగా ఏసీ త్రీటైర్ కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. నారాయణాద్రి, వెంకటాద్రి, సింహపురి, గౌతమి, దేవగిరి ఎక్స్‌ప్రెస్

తరువాయి 2లో..








ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భీమునిపట్నంలో అసోసియేషన్ అఫ్ పీపుల్ పవర్ ఆధ్వర్యంలో భీమునిపట్నం ఎస్.ఐ. రాంబాబు తో స్థానిక పాత బస్సు స్టాండ్ వద్ద మొక్కలు నాటారు, ఈ కార్యక్రమం అసోసియేషన్ అఫ్ పీపుల్ పవర్ సభ్యులు పాల్గొన్నారు.



భీమిలి మండలం కె నగరప్పాలెం లో బుధవారం వైసీపీ సీనియర్ నాయుకులు మరుపిల్ల చిన్నారావు స్థానిక యువకులకు క్రికెట్ కిట్టులు పంపిణి చేశారు.అనంతరం వై ఎస్ జగన్ ఎం పి ఎం.వి.వి.సత్య నారాయణ, ఎంఎల్ఎ ముత్తంశెట్టి శ్రీనివాసరావులు అత్యధిక మెజార్టీతో ఇక్కడ కామాక్షి అమ్మవారి దేవా లయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, అశోక్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

- ప్రతిఒక్కరికి రోజుకి 16 కేజీల ఆక్సిజన్ అవసరం
- పొగమంటలతో కేన్సర్‌కు కారకమైన రోగాలు
- ఎ.యు.లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు



విశాఖపట్నం : పర్యావరణ పరిరక్షణతోనే మానవాళికి మనుగడ సాధ్యమని ఆంధ్రా యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జి. నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఎ.యు. సైకాలజీ విభాగంలో భారత పర్యావరణ మంత్రిత్వ శాఖచే గుర్తింపబడిన ఎస్వీ ఎన్విరోల్‌ల్యాబ్స్, కన్సలెంట్స్ - సైకాలజీ విభాగం సంయుక్తంగా ప్రపంచ పర్యావరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నిపుణుల చర్చావేదికలో పలువురు ప్రొఫెసర్లు, వివిధ రంగాలకు చెందిన మేధావులు, ఉన్నతస్థాయి అధికారులు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు సంబంధించిన అంశాలను విపులంగా వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి ఉపకులపతి నాగేశ్వరరావు మాట్లాడుతూ నగరాలు కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్నాయని దీనితో గాలి, నీటి కాలుష్యం కూడా పెరుగుతుందన్నారు. ఇందుకు విరివిగా చెట్లను నాటాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణ కాపాడుకోవచ్చునన్నారు. కృష్ణా యూనివర్శిటి విశ్రాంతి ఉపకులపతి ఆచార్య రామకృష్ణారావు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆక్సిజన్ జోన్స్ కూడా ఏర్పాటుచేసే అవకాశం వుందన్నారు. ప్రతిఒక్కరికి రోజుకి 16 కేజీలు గాలి అవసరమని, అందులో 20% మెదడుకు చేరుతుందన్నారు. వాయు కాలుష్యాన్ని వీలైనంత మేరకు నియంత్రించాలన్నారు. 1980 నుంచి 2010 మధ్య తేడా చూస్తే ప్రజల్లో అవగాహన పెరిగి కాలుష్యం తగ్గుముఖం పడుతూ వస్తుందన్నారు. ప్రతి మానవుడు 24 గంటలకు 23 వేలు సార్లు గాలి పీల్చుస్తారని కాబట్టి కాలుష్యాన్ని వెదజల్లే గాలి పీల్చడం వల్ల అవి అనేక అవయావాలు దెబ్బతినేందుకు దోహదం చేస్తాయన్నారు. గాలి కాలుష్యంవల్ల గుండెకు రక్తాన్ని సరఫరా చేసే లంగ్స్ దెబ్బతింటాయన్నారు. మంట ద్వారా వచ్చే గాలి పీల్చడం వల్ల అత్యధికంగా కేన్సర్ వంటి రోగాలు సోకే అవకాశం వుందన్నారు. ఆంధ్రాయూనివర్శిటీ అకడమిక్ డీన్, సైకాలజీ విభాగం హెచ్.ఓ.డి. ప్రొఫెసర్ ఎం.వి.ఆర్. రాజు మాట్లాడుతూ నగరంలో పలురకాల పరిశ్రమలు రాత్రిపూట కాలుష్యాన్ని విడిచిపెడుతున్నాయని, తెల్లవారి లేచిన తరువాత ప్రజలందరూ వాటినే పీల్చుతున్నారన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రతిఒక్కరూ తమ నడవడికను సక్రమంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు ఎస్వీ ఎన్విరోల్‌ల్యాబ్స్, కన్సలెంట్స్ మేనేజింగ్ పార్టనర్ ఎం. మురళీకృష్ణ, విజయ్‌భాస్కర్‌లు మాట్లాడుతూ మంచి సంకల్పంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందన్నారు. కాలుష్యాన్ని నియంత్రించే బాధ్యత అందరిపైన వుందన్నారు. సదస్సులో కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ఎన్విరామ్‌మెంట్ ఇంజనీర్ శ్రీరామమూర్తి మాట్లాడుతూ కాలుష్యనియంత్రణకు సంబంధించి తాము తీసుకుంటున్న చర్యలను వివరించారు. భవిష్యత్‌లో గాలి, నీరు కాలుష్యం తగ్గించే విధంగా మరింత జాగ్రత్తలు పాటిస్తామన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఎ.యు. సైకాలజీ విభాగం విద్యార్థి గంట్ల శ్రీనుబాబు ఈ సదస్సుకు సమన్వయకర్తగా వ్యవహారించి మాట్లాడుతూ నిపుణులతో ఇటువంటి సెమినార్లు నిర్వహించడం వల్ల కాలుష్య నివారణకు అవసరమైన ఎన్నో అంశాలను తెలుసుకోనే అవకాశం కలిగిందన్నారు. ఈ సదస్సులో ప్రొఫెసర్లు కామేశ్వర రావు, పి.జె. రావు, ఎ.జె. రావు, ఎన్.ఎ.బి.సి. చెందిన రాజన్, జి.వి.యం.సి. నుంచి రవిప్రసాద్, ప్రొఫెసర్ జి. మంజులత, సునీల్‌కుమార్ రెడ్డి, జి.ఎ. నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో పర్యావరణ దినోత్సవం



సాగర్‌నగర్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రపంచ పర్యా వరణ దినోత్సవాన్ని బుదవారం నిర్వహించారు. గీతం అధ్యక్షులు ఎమ్.శ్రీభరత్, ఉపాద్యక్షులు ప్రొఫెసర్ ఎమ్.గంగాధర రావు, గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామ కృష్ణ గీతం ఆవరణలో మొక్కలు నాటారు. హరిత ప్రాంగణంగా గీతం కు గల జాతీయ స్థాయి పేరును పెంచేలా సౌర విద్యుత్ ఉత్పత్తి, వాన నీటి సంరక్షణ, వ్యర్థాల శుద్ధి సమర్ధంగా చేపడతామన్నారు.

కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎమ్,శరత్ చంద్ర బాబు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గౌతమ్ రావు, ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ బి.స్వామి, పర్యావరణ శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాలుష్యాన్ని నివారిస్తున్నాం

**పోర్టు డిప్యూటీ చైర్మన్ పిఎల్ హరనాథ్**



విశాఖ సిటీః విశాఖపట్నం పోర్టు ట్రస్టు పరిధిలో కాలుష్య నివారణకు సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళుతున్నట్లు పోర్టు డిప్యూటీ చైర్మన్ పిఎల్ హరనాథ్ వెల్లడించారు. కాలుష్యాన్ని నివారించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడ టమే పోర్టు తొలి ప్రాధాన్యత అని డిప్యూటీ చైర్మన్ స్పష్టం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీసీఆర్ జంక్షన్‌లో డెప్యూటీ చైర్మన్ మొక్కలు నాటారు. సుమారు 3000 మొక్కలను పీసీఆర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేశారు. ఇందుకోసం 25,50,000 రూపాయలను కేటాయించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మారు పర్యావరణ దినోత్సవాన్ని beat the air pollution అనే థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పోర్టు పరిధిలో దుమ్ము ధూళిని నివారించేందుకు కవర్డ్ నిల్వ కేంద్రాల నిర్మాణం కోసం గ్లోబల్ టెండర్లను పిలిచినట్లు డిప్యూటీ చైర్మన్ తెలిపారు. ఇందుకోసం కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ కొంత ఖర్చును భరించేందుకు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. విశాఖపట్నం పోర్టు ట్రస్టు కాలుష్య సూచీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని ఇందుకోసం పోర్టు పరిసర ప్రాంతాల్లో యాంబినెంట్ ఎయిర్ క్వాలిటీ స్టేషన్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలుష్య నివారణ కోసం పోర్ట్ తీసుకుంటున్న చర్యలను గుర్తుగా విశాఖపట్నం పోర్ట్ వరుసగా మూడు సంవత్సరాలు దేశం లోనే పరిశుద్ధ పోర్ట్ గా రెండవ స్థానాన్ని కైవసం చేసుకుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# భావి తరాలకు మంచి వాతావరణం అందించాలి

**- జాయింట్ కలెక్టర్ వెంకటరమణారెడ్డి**



విజయనగరం : పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీలు ఎంతగానో వినియోగపడతాయని భావి తరాలకు మంచి వాతావరణం అందించేందుకు కృషిచేయాలని జిల్లా జాయింట్ లకెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచపర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం స్థానిక ఎల్ఐసి భవనం నుంచి జెడ్పీ ఆఫీస్ వరకు జరిగిన ర్యాలిని ప్రారంభించారు.కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్నాదని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అఆగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని వాహనాలు, పరిశ్రమలు ఇతర కొన్ని వ్యర్థాలు వల్ల వాతావరణం కాలుష్యమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ సమతూల్యతను కాపాడేందుకు ప్రభుత్వ కార్లాయాల్లో, వసతి, విద్యా, కళాశాల, పరిశ్రమల ప్రాంగణాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని తెలిపారు. తద్వారా మంచి వాతావరణం, పరిశుభ్రమైన గాలి, సకాలంలో వర్షాలు వస్తాయని తెలిపారు. అనంతరం జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది వాయు కాలుష్యం తరిమికొట్టండి అనే అంశాన్ని తీసుకోవడం జరిగిందని , అటవీశాఖ మొక్కలు పెంపకంపై దృష్టి పెట్టాలని తెలిపారు.



*రంజాన్ సందర్భంగా ఉదయం నోవాటెల్ ఎదురుగా ఉన్న బీచ్ రోడ్డులో 'ఈద్ ఉల్ ఫితర్" కార్యక్రమం ముస్లిం సోదరులు ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంవివి సత్య నారాయణ విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు హాజరయ్యారు . నగరంలోని ముస్లిం సోదరులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు .*

# సబ్బవరంలో ఘనంగా రంజాన్ వేడుకలు



సబ్బవరం... మండలంలో ముస్లిం సోదరులు రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా బుధవారం ఉదయం నుండి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసి రంజాన్ పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఈ రంజాన్ వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో మసీదు వద్ద ఉదయం 6 గంటల నుండి ముస్లిం సోదరులందరూ మసీదుకు వచ్చి మత గురువులు బోధనలు విని భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో షేక్ షిలార్, షేక్ ఖాన్, ఆలీ, నాగురసా, ఇస్మయిల్,అబ్దుల్లా మొదలగు ఆమేనా తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ముస్లిం సోదరులకు ఆత్మీయ శుభాభినందనలు

కృతజ్ఞతలు తెలిపే ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు సీఎం వైఎస్ జగన్ ఆత్మీయ శుభాభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ప్రజలకు అల్లా దయ ఎల్లప్పుడూ ఉండాలని ముఖ్యమంత్రి కోరుకున్నారు.

# ఏపీ అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా అప్పల నాయుడు?

తర్వాత ఆయన పదవీకాలం ముగుస్తుంది. ప్రొటెం స్పీకర్‌ను గవర్నర్ నియమిస్తారు. ప్రస్తుత శాసనసభలో అత్యధిక సార్లు గెలుపొందిన వారిలో చంద్రబాబు నాయుడు ఉన్నారు. ఆయన 8సార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. 3 సార్లు ముఖ్యమంత్రిగా, రెండు పర్యాయాలు ప్రతిపక్షనేతగా వ్యవహరించారు. ప్రస్తుత సభలో ఆయనే ప్రతిపక్ష నేతగా ఉండనున్నారు. దీంతో ఆయన ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించే అవకాశం లేదు.

ఆ తర్వాత వైకాపా నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి , తెదేపా నుంచి గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైకాపా ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో అవకాశం దక్కితే ముందుగానే ప్రమాణ స్వీకారం చేయనున్నందున వారికి ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించే అవకాశాలుండవు. దీంతో సీనియారిటీ దృష్ట్యా శంబంగి వెంకట చిన్న అప్పల నాయుడుని ప్రొటెం స్పీకర్‌గా నియమించేందుకు ఎక్కువ అవకాశాలు కన్పిస్తున్నాయి.త్వరలో గవర్నర్ నుంచి ఇందుకు సంబంధించి ఆదేశాలు రానున్నాయి.

# నీట్ ఫలితాలు విడుదల

బుధవారం విడుదలయ్యాయి. మే 5న దేశవ్యాప్తంగా 154 పరీక్ష కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా 15,19,375 మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకోగా.. 14,10,754 మంది పరీక్షకు హాజరయ్యారు. ఒడిశాలో ఫొని తుపాను, కర్ణాటకలో రైలు ఆలస్యం కారణంగా అక్కడి అభ్యర్థుల కోసం గత నెల 20న మరోసారి పరీక్ష నిర్వహించారు. దీంతో ఫలితాలు ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయన్న సందేహాలు నెలకొన్నప్పటికీ.. ముందుగా పేర్కొన్నట్టుగానే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఫలితాలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 56.27 శాతంతో 7,97,042 మంది విద్యార్థులు నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ఉత్తీర్ణతా శాతం 56.27గా నమోదైంది. ఏపీలో 72.55 శాతంతో 39,039 మంది, తెలంగాణలో 68.88శాతంతో 33,044 మంది ఉత్తీర్ణులయ్యారు.

***తెలంగాణ విద్యార్థినికి ఏడో ర్యాంకు***

నీట్ జాతీయ ర్యాంకులను ఎన్‌టీఏ విడుదల చేయగా.. దిల్లీకి చెందిన విద్యార్థి నలిన్ ఖండేల్‌వాల్ 701 మార్కులతో మొదటి ర్యాంకు సాధించి సత్తా చాటగా.. 695 మార్కులు సాధించి తెలంగాణ విద్యార్థిని జి.మాధురిరెడ్డి ఏడో ర్యాంకులో మెరిశారు. 690 మార్కులతో ఏపీ విద్యార్థిని ఖురేషీ అస్రా 16వ ర్యాంకు సాధించారు. అలాగే ఏపీకి చెందిన పిల్లి భానుశివతేజ 40వ ర్యాంకు, ఎస్.శ్రీనందన్ రెడ్డి 42వ ర్యాంకుల్లో నిలిచారు.

# 10 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా ఏసీ కోచ్‌లు!

రైళ్లల్లో అదనంగా ఒక కోచ్‌ను ఏసీ త్రీటైర్‌గా మార్చనున్నట్టు తెలిపింది. ఇప్పటికే ఈ రైళ్లలో ఏసీ టూటైర్, త్రీ టైర్ కోచ్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే పెరుగుతున్న ప్రయాణికులకు మరింత సేవలందించేందుకు వీలుగా పైన పేర్కొన్న ప్రతిరైలులో అదనంగా ఒక ఏసీ కోచ్‌ను ఏర్పాటు చేయనున్నారు. అక్టోబర్ 1 నుంచి వీటి సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# ఘనంగా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం-2019

***- 5వేల మొక్కలను నాటిన గంగవరం పోర్టు లిమిటెడ్***




గాజువాక: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని గంగవరం పోర్టు లిమిటెడ్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా పోర్టు ప్రాంగణంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే జీవన మనుగడ సాగుతుందని, కాలుష్యకారకాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని కోరారు. కాలుష్యనివారణకు గంగవరం పోర్టు యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని అన్నారు. పోర్టు ప్రతినిధులు మాట్లాడుతూ మే31నుంచి జూన్ 05వరకు గాలి, కాలుష్యంపై పోర్టు పర్యావరణ వేడుకలను ఘనంగా నిర్వహించామని, ఇందులో భాగంగా అనేక అవగాహన కార్యక్రమాలను గాంధీనగర్ హెచ్‌బికాలనీ, వుడాకాలనీ ఫేజ్-2,గంగవరం ప్రాంతాలలో నిర్వహించామని తెలిపారు. విశాఖలో ఏపీ కాలుష్యమండలి ఆద్వర్యంలో కాళీమాత ఆలయం వద్ద నిర్వహించిన గ్రీన్ ర్యాలీలో గంగవరం పోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.ఈ వేడుకలలో భాగంగా పోర్టు సిబ్బంది, మేనేజ‌ుమెంట్ గ్రీన్ డ్రైవ్‌ను 45వేల మొక్కలను నాటి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో సుమారు ఒక లక్ష మొక్కలు నాటేవిధంగా లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ (యుఎన్ఓ) అంచనాల ప్రకారం 'దాదాపు 7మిలియన్లమంది ప్రజలు అంతర్జాతీయంగా ప్రతీ సంవత్సరం గాలి, కాలుష్యం కారణంగా మరిణిస్తున్నట్లు తెలిపారు. వీరిలో ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోనే సుమారు 4మిలియన్ల మంది ప్రజలు మరిణిస్తున్నట్లుతెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2019 ద్వారా అంతర్జాతీయంగా ప్రధాన మైన సంస్థలు ఎన్‌జిఓలు,పరిశ్రమలు, కమ్యూనిటీలు, ప్రభుత్వాలు, సెలబ్రిటీలను పర్యావరణ అనుకూలఅంశాలను స్వీకరించడంతోపాటు ప్రచారం చేయవలసిసిందిగా కోరుతున్నాయని అన్నారు. పునరుత్పాదక శక్తిని, గ్రీన్ టెక్నాలజీస్‌ను అన్వేషించడంతో పాటు అంతర్జాతీయంగా నగరాలు, ప్రాంతాలలో గాలి నాణ్యతను మెరుగుపర్చుకోవలసిన అవరసరం ఎంతైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గంగవరం పోర్టు లిమిటెడ్ ప్రతినిధులు సి.ఇ.ఓ.సాంబశివరావు, సీఓఓ వి.జనార్ధన్‌రావు, డైరెక్టర్ (ఎస్అండ్.పి.)యస్.రాజు, వైస్ ప్రెసిడెంట్ (విజిలెన్స్ ఆర్.ఆర్.ఆర్, సెక్యూరిటీ) బాలకృష్ణ, వైస్ ప్రెసిడెండ్ (ఆర్.ఆర్.ఆర్, సెక్యూరిటీ)ఎస్ రామునాయుడు, వైస్ ప్రెసిడెంట్ (ఎన్విరాన్‌మెంట్) డీ.జ్యోతి, పోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత

మొక్కలు నాటుతున్న సనపల రవీంద్ర భరత్



విశాఖపట్నం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రముఖ సంగ సేవకులు, సామాజిక వేత్త సనపల రవీంద్ర భరత్ గారి ఆధ్వర్యంలో దక్షిణ నియోజకవర్గం లో గల సీబీఎం హై స్కూల్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటి కాలుష్య కోరల్లో చిక్కుకుని వున్న మనల్ని రక్షించేందుకు కృషి చేయాలి అని అన్నారు దక్షిణ నియోజకవర్గం లో గత పాలకులు ఎవరు కాలుష్యం మీద తీసుకున్న చర్యలు శూన్యం అని దుయ్యబట్టారు ప్రతీ సంవత్సరం ఇదే విధంగా మొక్కలు నాటుతున్నం అని గత సంవత్సరం ఫిషింగ్ హార్బర్ లో నాటడం జరిగింది అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి చొడిపల్లి శివకుమార్ సహకారాలు అందించారు,కరుకోల జీవన్,సేశరత్నం,తదితరులు పాల్గొన్నారు.

# వాయు కాలుష్య నివారణ లక్ష్యంగా మొక్కలు నాటండి



విశాఖపట్నం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వాయు కాలుష్యం, ప్లాస్టిక్ రహిత విశాఖ లక్ష్యం కావాలని జి.వి.ఎం.సి. కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. జి.వి.ఎం.సి. ప్రధాన కార్యాలయంలో బుధవారం మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ కోసం ప్రజలు ఆర్.డబ్ల్యు.ఏ లు, స్వచ్ఛంధ సంస్థలు భాగస్వామ్యులు కావాలని కోరారు. జి.వి.ఎం.సి. పరిధిలో ప్రస్తుతం6.5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతోందని, 20-21 నాటికి 25 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమానికి సి.ఎం.ఓ.హెచ్. డా॥ ఎ.హేమంత్ స్వాగతం పలుకుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు చొరవ చూపాలని కోరారు. తొలుత స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి స్వచ్ఛభారత్ కార్యక్రమాలలో షార్ట్ ఫిల్మ్ కంటెస్ట్, అడాప్ట్ ఏ వాల్, వేస్ట్ టు బెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించారు.

అనంతరం ఆర్.డబ్ల్యు ఎలు స్వచ్ఛంధ సంస్థలు, స్వచ్ఛ భారత్ అంబాసిడర్లకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం అదనపు కమిషనర్ జి.వి.వి.ఎస్.మూర్తి, సి.ఎం.ఓ.హెచ్. డా॥ హేమంత్, స్వచ్ఛ భారత్ అంబాసిడర్లు, ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు, డా॥ విశ్వేశ్వరరావు, పి.ఎల్.కె.మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఏడిహెచ్ దామోదర్, ఎస్ఇ ప్రసాదరాజు, జోనల్ కమిషనర్లు రాము, రమణమూర్తి, చిట్టిబాబు, దుర్గా ప్రసాద్, శ్రీనివాస్, గోవిందరావు, ఎ.ఎం.ఓ.హెచ్‌లు డా॥ ఎస్.జయరాం, డా॥ సుధాకర్, డా॥ రాజేష్, ఇ.ఇ. మెహర్‌బాబు, సోహన్ హట్టంగడి తదితరులు హాజరైనారు.









## వైకాపా పార్లమెంటరీ పార్టీ నేతగా విజయసాయి రెడ్డి



అమరావతి: వైకాపా పార్లమెంటరీ పార్టీ నేతగా విజయసాయిరెడ్డి నియమితులయ్యారు. లోక్‌సభలో వైకాపా పక్ష నేతగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, విప్‌గా మార్గాని భరత్‌ను నియమించారు. ఈముగ్గురిని ఆయా పదవుల్లో నియమిస్తున్నట్లు వైకాపా అధ్యక్షుడు, ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రికి లేఖ రాశారు. విజయసాయిరెడ్డి ప్రస్తుతం రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. వైకాపాలో కీలకనేతగా ఉన్న విజయసాయిరెడ్డిని రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరిగింది. కానీ, చివరకు ఆయన్ను పార్లమెంటరీ పార్టీ నేతగా నియమించారు.




# విజయభాను సంపాదకీయం

## విచ్ఛిన్నం దిశగా మహాకూటమి

మోదీ నాయకత్వంలోని బీజేపీ సృష్టించిన సునామి ప్రభావం ఎన్నికల తరువాత కూడా ప్రతిపక్షాలపై పడుతున్నది. దేశంలో అతిపెద్ద రాష్ట్రంగా ప్రధాని ఎవరు కావాలో నిర్ణయించే ప్రాం తంగా పేరున్న ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని ఎదుర్కొనేందుకు ఏర్పడిన ఎస్పీ, బీఎస్పీ మహాకూటమి విచ్ఛిన్నం దిశగా పయనిస్తున్నది. మహాకూటమి ఓటమికి ఎస్పీ ఓట్లు బీఎస్పీకి బదిలీకాకపోవటమే కారణమని అంటున్న బీఎస్పీ అధినేత్రి మాయావతి అదొక పనికిమాలిన కూటమి అని తేల్చేశారు. రానున్న ఉప ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతామని ప్రకటించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీలోనూ తలెత్తిన సంక్షోభం ఇంకా సద్దుమనగలేదు. కాంగ్రెస్ పార్టీ రెండవసారి కూడా ప్రతిపక్ష హోదా సాధించకపోవడంతో రాహుల్‌కు సంజాయిషీ కూడా ఇచ్చుకోలేని పరిస్థితి ఏర్పడ్డది. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ పార్టీ అధ్యక్ష పదవి నుంచి రాహుల్‌గాంధీ తప్పు కోవటానికి సిద్ధపడ్డారు. ఇతర కాంగ్రెస్ సీనియర్ నేతలు, చివరికి కుటుంబ సభ్యులు కూడా వారించినా రాహుల్ ససేమిరా అని భీష్మించుక్కూర్చున్నారు. కాంగ్రెస్ అత్యున్నత కార్యనిర్వాహక వర్గం రాహుల్ రాజీనామాను ఆమోదించకున్నా సంక్షోభం నుంచి పార్టీని గట్టెక్కించలేకపోయింది. పశ్చిమబెంగాల్‌లో ఎదురులేని నేతగా ఉన్న మమతా బెనర్జీ పార్టీ తృణముల్ కాంగ్రెస్ కూడా ప్రకంపనలకు గురవుతున్నది. సాధారణ ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీలోకి తృణముల్ నేతల వలసలు పెద్ద ఎత్తున ప్రారంభమయ్యాయి. చివరికి సీపీఎం నేతలు కూడా బీజేపీ గూటికి చేరుతున్న స్థితి. ఉత్తరప్రదేశ్‌లో బలమైన సామాజిక పునాది కలిగి సొంతంగా ప్రభుత్వాలు కూడా ఏర్పరిచిన చరిత్ర సమాజ్‌వాది పార్టీ, బహుజన్ సమాజ పార్టీలది. నరేంద్ర మోదీని ఎదుర్కొనడానికి ఈ రెండు లోక్‌సభ ఎన్నికలలో ఏకతాటిపైకి వచ్చాయి. ఈ ప్రయోగం విజయవంతమవుతుందని భావించిన ఈ రెండు పార్టీలు రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో కూడా కలిసి పోటీచేయాలనే అవగాహనకు వచ్చినట్టు చెబుతారు. ఈ ఏకత బీజేపీ ని వ్యతిరేకించే శక్తులకు ఓ ఆశాకిరణంగా కూడా కనిపించింది. బీజేపీని నిలువరించాలంటే ఇలాంటి సర్దుబాటు స్వభావం ఆహ్వానించదగిందని ఆనందపడ్డాయి. ఓబీసీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్పీ, దళిత బహుజనవర్గాలకు ప్రతినిధిగా ఉన్న బీఎస్పీ ఏకతాటిపై నిలిచి ఎన్నికల్లో పోటీచేస్తే ఎదురే ఉండదన్న అభిప్రాయం కలిగింది. ఈ క్రమంలోంచే బీఎస్పీ 38, ఎస్పీ 37, ఆర్‌ఎల్‌డీ మూడు సీట్లకు పోటీపడ్డాయి. కానీ బీఎస్పీ 10, ఎస్పీ 5 సీట్లు మాత్రమే గెల్చుకొని ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్నాయి. మరో వైపు బీజేపీ తన మిత్రపక్షంతో కలిపి 64 స్థానా లు గెలుచుకొని అదే ఊపును దేశవ్యాప్తంగా చూపింది. ఏకంగా మూడువందల పైచిలుకు స్థానాలు సాధించి తిరుగులేనిశక్తిగా ఎదిగింది. పదిహేను రాష్ట్రాల్లో సగానికి పైగా ఓట్ల శాతాన్ని సాధించింది. మరికొన్ని దక్షిణాది రాష్ట్రాల్లో గణనీయంగా ఓట్ల శాతాన్ని పెంచుకున్నది. ఈ సందర్భంగా ఎస్పీ అధినేత అఖిలేశ్‌యాదవ్ -ఈ ఎన్నికలు జరిగిన సరళి వేరు. ఈ ఎన్నికలు సమస్యలు, అంశాలపై జరుగలేదు. వారు (బీజేపీ) మన మెదళ్లలోకి చొచ్చుకుపోయారు. టీవీలు, మొబైల్స్‌లో వారే కనిపించారు. దీన్ని మేం అర్థం చేసుకోలేకపోయాం అని నిర్ధారించటం గమనించదగినది. సాధారణ ఎన్నికలకు ముందు రాజకీయపార్టీలు, కూటములపై రాజకీయ విశ్లేషకులకు సైతం అనేక అంచనాలుండేవి. గత ఐదేండ్ల పాలనాకాలంలో ఉత్తరభారతంలో జరిగిన అనేక సామాజిక ఘటనలకు తోడు, పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ లాంటి పన్నుల విధానం మోదీ పాలనాతీరుపై ప్రతికూల ప్రభావాలనే వేస్తాయన్న అభిప్రాయాలు బలంగా ఉండేవి. కానీ దేశవ్యాప్తంగా ఎంతో ప్రభావం చూపుతుందనుకున్న కాంగ్రెస్ పూర్తిగా డీలా పడిపోగా, లోక్‌సభ ఎన్నికల కోసమే ఏర్పడిన ఎస్పీ-బీఎస్పీ కూడా కుదేలయింది. బీజేపీ మాత్రం తనదైన నిర్మాణ కౌశలంతో సామాజికవర్గాలను తమవైపు తిప్పుకోవటంలో విజయవంతమైంది. ఇతర వెనుకబడినవర్గాలకు (ఓబీసీ) ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్పీ నుంచి యాదవేతరులను, దళిత బహుజనవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న బీఎస్పీ నుంచి జాతవేతరులను బీజేపీ తమవైపు ఆకర్షించగలిగింది. దీనికి ఆలంబనంగా హిందుత్వాన్ని వాడుకున్నది. అనేక రూపాల్లో మెదళ్లలో తిష్టవేస్తున్న హిందుత్వవాదాన్ని వనరుగా వాడుకొని ఎదుగుతున్న బీజేపీ, అనేకవిధాలుగా భారతీయ జీవనవిధానానికి ప్రతిబంధకంగా కాబోతున్నదన్నది కొందరి ఆందోళన. రాబోయేకాలంలో ఈ పరిణామాల తీవ్రత మరింత హెచ్చుగా ఉండబోతున్నది. మెజార్టీవాదం పేరుతో సామాజిక సమూహాల అస్తిత్వాలన్నింటినీ మింగేసి బహుళ రాజకీయవ్యవస్థల ఉనికినే ప్రశ్నార్థకం చేసే దుస్థితి ఏర్పడే ప్రమాదం ఉన్నది. అస్తిత్వ మూలాలు కూలుతూ, వాటి ఉనికే ప్రశ్నార్థకమవుతోంది.

# అప్పన్నను దర్శించుకున్న వివిధ ప్రముఖులు



సింహాచలం :శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామివారిని బుధవారం నాడు కమాండింగ్ ఇన్ చీఫ్ ఆఫ్ ఈస్టన్ నావల్ కమాండ్ అతుల్ కుమార్ జైన్ మరియు డీ ఎం హెచ్ ఓ డీ ఆర్ ఎస్ .తిరుపతిరావు ఐ ఏ ఎస్ ఆఫీసర్ హర్షవర్ధన్ మొదలుగు వారు స్వామివారిని దర్శించుకున్నారు . సింహగిరికి చేరుకున్న వీరికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలుకగా .బేడా ప్రదిక్షణ కప్పస్థంబ ఆలింగనం అనంతరం అంతరాలయంలో అర్చకస్వాములు వీరి గోత్రనామములతో ప్రత్యేక అర్చనలు చేసారు . అనంతరం లక్ష్మీ అమ్మవారి దర్శనం చేసుకున్నవీరికి ఆలయ వైదికులు వేద అశీర్వచనం పలుకగా ఆలయ అధికారులు వీరికి స్వామివారి చిత్రపటం ప్రసాదములు అందజేశారు.

# సమైక్యత, విశ్వాసాలకు రంజాన్ ప్రతీక



రావులపాలెం : సమైఖ్యతా విశ్వాసాలకు రంజాన్ పర్వదినం ప్రతీక అని, అనాదిగా వస్తున్న ఆచార అలవాట్లను తూచా తప్పకుండా పాటించాలని ముస్లిం పెద్దలు మహబూబ్ సుభాని అన్నారు. బుధవారం రావులపాలెంలోగల మస్జీద్‌కు తెల్లవారుఝామునే అనేక మంది ముస్లిం సోదరులు చేరుకొని ప్రత్యేక ప్రార్ధనలు చేసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలో రంజాన్ పండుగ పర్వదినం పురస్కరించుకొని పండుగ వాతావరణం నెలకొంది. ఈద్ ఉల్ నిర్వహించిన అనంతరం ముస్లిం మత గురువులు ఖురాన్ పఠించి ప్రార్ధనలు చేసి సర్వ మానవాళి సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భముగా పెద్దలు మాట్లాడుతూ సన్మార్గం, సద్భావం, ఆదర్శ జీవన విధానం రంజాన్ నేర్పే పాఠం అని పెద్దలు తెలిపారు. పండుగలు, ఉత్సవాలు మన సంస్కృతి, సాంప్రదాయాలు, సమైఖ్యతా విశ్వాసాలకు దర్పణాలని, ముస్లింలు జరుపుకునే పండుగలలో ఈద్ ఉల్ ఫితర్‌గా పిలువబడే ఈ రంజాన్ అత్యంత ముఖ్యమైనదని, ముస్లింలు అనుసరించే ఫసలీ కాలమానం ప్రకారం 9 వ నెల అయిన రంజాన్ మొదటి రోజునుండి ఈ పండుగ ప్రారంభమౌతుందని, ఈ విశ్వంలో తిండీ, దప్పికలు కూడా తీర్చుకోలేని అనాధలు, నిరుపేదల అనుభూతులను సంపన్నులకు అనుభవంలోకి తెచ్చే పండుగని రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు. అలాగే రంజాన్ సందేశాన్నిస్తూ ఈ నెల రోజులు సూర్యోదయానికి ముందే "సహేరి" తో ప్రారంభించి పగలంతో ఒక్క చుక్క మంచినీరు ముట్టకుండా కటిక ఉపవాసం ఉండి సూర్యాస్తమయం తర్వాత నమాజు చేసి ఇఫ్తార్‌తో ముగిస్తారని, నెల చివరి రోజున చంద్రదర్శనం అనంతరం "షవ్వాల్" నెల ప్రారంభపు రోజున పెద్ద ఎత్తున ఈ పండుగ జరుపుకుంటారని తెలిపారు. మస్జీద్ రియాజ్ పాషా ఆధ్వర్యంలో గ్రామ పుర వీధులలో ముస్లిం సోదరులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, షేక్ బాబ్జి, ఎమ్‌డి. ఖరీమ్, ఎమ్‌డి హుస్సేన్, ఎస్‌కె భాషా, సయ్యద్ వల్లీభాషా, ఎమ్‌డి రబ్బాని, సైఫుల్లాఖాన్, షేక్ అన్సారి, షేక్ ఇబ్రహిం ముస్లి సోదరులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని అలవర్చుకుందాం

### ఫాదర్ థామస్ పల్లిదానం




రావులపాలెం : ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని అందరూ అలవర్చుకోవాలని, ప్లాస్టిక్ వాడడం వల్ల ప్రపంచ మానవాళికి పెను ముప్పు వాటిల్లనుందని, ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు వాడకం పూర్తి నిషేదించాలని స్థానిక పారా సంస్థ నిర్వాహకులు, ఫాదర్ జాన్ పాన్సూస్ తెలిపారు. బుధవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భముగా స్థానిక పారా సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ హైవేపై ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భముగా ప్లాస్టిక్ నిషేదంపై అన్ని ప్రభుత్వ రంగాల్లో నిషేద చర్యలు చేపట్టాలని, వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని, చెట్లు పెంపకాన్ని చేపట్టాలని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భముగా ఫాదర్ థామస్ పల్లిదానం మాట్లాడుతూ స్వీడన్ దేశస్తురాలు గ్రేట్‌తుగ్‌బర్గ్ అనే అమ్మాయి 4వ తరగతి చదువుతున్న సమయంలో పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశ్యంతో గురువారం వరకు స్కూలుకు వెళ్ళి మిగితా రోజుల్లో చెట్లను నాటుతూ అందరిలో ఉద్యమాన్ని నెలకొల్పిందని, ఒక్క అడుగుతో మొదలైన ఈ ఉద్యమం ప్రపంచంలో అన్ని దేశాల్లో మహోద్యమంగా రూపుదిద్దకుందన్నారు. ప్రతి ఒక్కరు చెట్లను నాటుతూ భావితరాల భవిష్యత్తును కాపాడేందుకు కృతనిశ్చయంతో ఉండాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పారా సిబ్బంది, ఎస్.ఎఫ్.ఐ. అధ్యక్షులు ప్రేమ్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పర్వతను కలిసి అభినందనలు తెలిపిన అన్నవరం విలేకర్లు

అన్నవరంః తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వై యెస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులుగా విజయం సాధించిన పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ని బుధవారం ఉదయం శంఖవరం ఆయన స్వగృహంలో కలిసి మర్యాద పూర్వకంగా అభినందనలు తెలిపిన అన్నవరం వర్కింగ్ జర్నలిస్ట్ సోదరులు.జర్నలిస్ట్ సోదరులతో ఎమ్మెల్యే పర్వత మాట్లాడుతూ నా నియోజకవర్గంలో నాలుగు మండలాల ప్రజలు నన్ను నమ్మి గెలిపించినందుకు అందరికి కృతజ్ఞతలు తెలిచేస్తున్నాను. నన్ను గెలిపించిన ప్రజలకి ఎలాంటి లోటుబాటులు లేకుండా సమస్యల పై దృష్టి పెడతాను అని పర్వత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరం జర్నలిస్టులు రుషి ,రాజేష్, ప్రసాద్, గణేష్, బాలకృష్ణ మూర్తి,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# కవి సమయం

## దుష్టులకు దూరంగా వుండవలెను

దుష్టులతో స్నేహం చేస్తే మనకూ అదే విధమైన పేరు వస్తుంది. మీరు మంచివారయినా మీ సావాసగాళ్ళు చెడ్డవారైతే మిమ్మల్ని కూడా చెడ్డవారిగానే ఈ లోకం పరిగణిస్తుంది. తాడిచెట్టు క్రింద కూర్చుని పాలు త్రాగినా కల్లు తాగుతున్నాడనే అంటారు. అంటే దుష్టుల ఛాయకు అంత చెడ్డపేరు వుందన్నమాట. చెడ్డవారితో స్నేహం మొదలు బాగానే వుంటుంది. కానీ చివరకు వ్యసనాలను, అనేకమైన ఇతర దుర్గణాలనూ నేర్పిస్తుంది. కాబట్టి చెడ్డవారికి దూరంగా వుండటం మంచిది. ఈ విషయాన్ని ఓ వేమన పద్యం ద్వారా విందాం.

'కానివానితోడు గలసి మెలుగుచున్న
గానివానివలెనె కాంతురవని
తాడిక్రిందుబాలు త్రాగిన చందమౌ
విశ్వదాభిరామ వినురవేమ'

... రచయిత
వడ్లమాని అన్నపూర్ణ

# పంచాంగం

| మాసం : జ్యేష్ఠ; తిథి : తదియ ఉ.11.34; పునర్వసు రా.10.30; ఉ.వ.11.02ల 12.34. | గురువారం 06-06 -2019 |
|---|---|

**మేషం** : మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. కొంతమంది సూటిపోటి మాటలు పడటం వల్ల మానసిక ఆందోళనకు గురవుతారు. పాత వస్తువులను కొని ఇబ్బందులను ఎదుర్కొంటారు. ట్రాన్స్‌పోర్టు, ట్రావెలింగ్ రంగాల వారికి కలిసిరాగలదు. దూర ప్రాంతాలకే చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. **వృషభం** : ధనం ఏమాత్రం నిలబెట్టలేక పోయినా ఆర్థిక ఇబ్బంది అంటూ ఏదీ ఉండదు. సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. అకాల భోజనం, ప్రశాంతత లోపం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు పనివారలతో సమస్యలు తలెత్తుతాయి. రిజిస్ట్రేషన్లకు ఇది అనువైన సమయం కాదు. **మిథునం** :మీరు చేసే పనులకు బంధువుల నుంచి విమర్శలు, వ్యతిరేకత ఎదుర్కొనక తప్పదు. ముఖ్యులకు బహుమతులను అందజేస్తారు. రాబోయే కాలంలో ఖర్చులు, అవసరాలు మరింత పెరిగేందుకు ఆస్కారం ఉంది. నిరుద్యోగులకు ఉపాధి పథకాలు సంతృప్తికరంగా సాగుతాయి. వాగ్వివాదాలకు దూరంగా ఉండటం మచిది. **కర్కాటకం** : ప్రముఖులను కలుసుకుని బహు మతులను అందజేస్తారు. మధ్యవర్తిత్వం వహించుట వల్ల ఇబ్బందులను ఎదుర్కొం టారు. మీలోని శక్తిసామర్థ్యాలు ద్విగుణీకృతమయ్యే అవకాశం దక్కుతుంది. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది. వృత్తి, ఉద్యోగాలలో వారికి ఆదా యం సంతృప్తికరంగా ఉంటుంది. ధన లబ్ధి పొందుతారు. **సింహం** : ప్రైవేటు సంస్థలలోని వారికి ప్రతి విషయంలోనూ ఓర్పు, లౌక్యం అవసరం. మీ అభిరుచులకు తగిన వ్యక్తులతో పరిచయాలు పెంచుకుంటారు. విదేశాలకు వెళ్ల డానికి చేయు యత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు పనివారితో చికాకులు ఎదురవు తాయి. ఉద్యోగస్తుల హోదా పెరగడంతో పాటు... బరువు బాధ్యతలు అధిక మవుతాయి. **కన్య** :ప్రభుత్వ కార్యక్రమాలలోని పనులు అనుకూలిస్తాయి. స్త్రీలకు షాపింగ్, వ్యవహారాలలో మెళకువ అవసరం. నిరుద్యోగులకు బోగస్ ప్రకటనలు, కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్త అవసరం. గృహంలో చికాకులు తొలగి ప్రశాంతత నెలకొంటుంది. మీ సంతానం కోసం ధనం బాగా వ్యవం చేయవలసి వస్తుంది. **తుల** : ఇప్పటివరకు విరోధులుగా ఉన్న వ్యక్తలను సుముఖం చేసుకోగలుగుతారు. ప్రేమికులు పెద్దల ఆగ్రహావేశాలకు గురికావలసి వస్తుంది. వాహన చోదకులకు ఆటంకాలు తప్పవు. బంధు మిత్రులతో మనస్పర్థలు తలెత్తు తాయి. చేతి వృత్తి వ్యాపారులకు లాభదాయకం. రాజకీయ రంగాల వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. **వృశ్చికం** : ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. పెద్దల ఆరోగ్య, ఆహార విషయాల్లో మెళకువ అవసరం. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తినిస్తాయి. మిత్రుల కారణంగా మీ కార్యక్రమాలు మార్చుకోవలసి వస్తుంది. బంధువుల రాక వల్ల ఖర్చులు అధికమవుతాయి. సిమెంట్, ఇసుక, ఐరన్, కలప వ్యాపారులకు పురోభివృద్ధి. **ధనుస్సు** :వ్యాపారాల్లో నూతన భాగస్వాములను చేర్చుకునే విషయంలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి వస్తుంది. పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యం తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. విద్యార్థుల ఆలోచనలు పక్కదారి పట్టే ఆస్కారం ఉంది. దైవ కార్య క్రమాలకు కుటుంబీకులతో ఉల్లాసంగా గడుపుతారు. **మకరం** : ఉద్యోగస్తుల శక్తి సామర్థ్యా లను అధికారులు గుర్తిస్తారు. మీ శ్రీమతి సలహా పాటించడం చిన్నతనంగా భావించకండి. విద్యా, వైజ్ఞానిక విషయాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. విలాస వస్తు వులు అమర్చుకోవాలనే స్త్రీల కోరికలు నెరవేరుతాయి. కాంట్రాక్టర్లకు ఇంజనీరింగ్ అధికారుల నుంచి అభ్యంతరరాలెదుర్కోవలసి వస్తుంది. **కుంభం** :చిన్నాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. మీ జీవిత భాగస్వామి సలహా తీసుకోవడం శ్రేయస్కరం. ప్రైవేటు సంస్థలలోని వారికి ఓర్పు, నేర్పు పరీక్షా సమయం. అనవసరపు వాగ్ధానాలు చేసి సమస్యలు తెచ్చుకోకండి. రుణ యత్నాలు వాయిదా పడతాయి. దూర ప్రయాణాలు విసుగు కలిగిస్తాయి. **మీనం** : వ్యాపారంలో పెరిగిన పోటీని తట్టుకోవడానికి అహర్నిశలు శ్రమిస్తారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. రుణ బాధలు తొలగుతాయి. నిరుద్యోగులకు ఇంట ర్వ్యూలు, రాత పరీక్షలలో మెళకువ, ఏకాగ్రత అవసరం. పత్రాలకు సంబంధించిన విషయాలలో ఏకాగ్రత ముఖ్యం. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలను స్వీకరిస్తారు.

# బాబాను దర్శించిన యోగులు



## సంకీర్తన

శ్రీ చంద్రయోగి

ఆమె పెదనాన్న లక్ష్మీ నరసింహారావుగారు ఒకసారి శృంగేరీ పీఠాధిపతులను, వారి పరివారమును తమ ఇంటికి పిలిచి, ఆతిథ్యమివ్వాలని ఎంతో ప్రయత్నించి విఫలమయ్యారు. ఎంత ప్రార్థించినా వారు హైదరాబాద్ పరగణాలోకి రావటానికి అంగీకరించలేదు.

ఒకరోజు రాత్రి శారదాదేవీకి కలలో పెద్ద పెద్ద జడలు, గెడ్డము ఉన్న ఒకయోగి కనిపించి 'అమ్మాయీ! శంకరస్వామి మీ ఇంటికి తప్పక రాగలరు. మీ పెద్దనాన్నను స్వయంగా వెళ్ళి ఈసారి ఆహ్వానించమని చెప్పు. ఆయన తప్పక విచ్చేయగలరు. ఇది చంద్రయోగి ఆశీర్వాదము! ఈ విషయము నాన్నగారితో చెప్పు. నాకు నమస్కారము చేసుకొని నా దగ్గరకు రా..' అన్నారు. శారదాదేవి ఆయనతో 'నేను ఎక్కడకు రాను' అన్నది. అప్పుడు ఆ యోగి ఆ అమ్మాయి శిరస్సుపై హస్తము నుంచి 'నీవు వస్తావులే' అని చెప్పి వెళ్ళారు.

శారదాదేవి తండ్రితో ఈ స్వప్న వృత్తాంతమునంతా చెప్పింది. ఆ యోగి చెప్పినట్లే ఆమె పెదనాన్న వెళ్ళి శృంగేరీ శంకరస్వామిని ఆహ్వానించటము, ఆయన అంగీకరించి వారింటికి రావటము, వైభవోపేతంగా ఆ కార్యక్రమం జరగటము అన్నీ వారు చెప్పిన విధంగానే అయినాయి.

శారదాదేవి శృంగేరీ పీఠాధిపతులకు నమస్కారం చేసినప్పుడు ఆయన 'అమ్మాయికి మంచి భగవద్భక్తి ఉంది. ఈమెకు యోగులు. పుణ్య పురుషులు, మహనీయుల దర్శనమవుతుంది. లౌకికి చింతనలను విడిచి కలియుగంలో పరమేశ్వరావతార సేవతో తరిస్తుంది' అన్నారు.

ఒకసారి శారదాదేవి తన తండ్రి తాతలతో బదరీయాత్రకు వెళ్ళింది. అక్కడ బదరీలో ఒకచోట ఒక నాలుగు అంగుళముల చిన్న బంగారు కృష్ణ విగ్రహం ఆమెకు దొరికింది. బదరీలోనే ఆమె తండ్రి నుండి బాలగోపాల మంత్రమును ఉపదేశం పొందింది. ఆ మంత్రజప ప్రభావం చేత కూడా ఆమెకు కృష్ణభక్తి ఎక్కువయింది. 'నా గోపాలుడు, నా గోపాలుడు' అంటూ ఆమె ఆ చిన్న గోపాలుని బొమ్మను విడిచిపెట్టేదికాదు. ఆమె తనను తాను రాధగా ఊహించుకొని ఆ కృష్ణుణ్ణి తనివితీరా ఆరాధిస్తూ ఉండేది. ఆ నందనందనుడు ఎక్కడ కనిపిస్తాడా, ఎప్పుడు కనిపిస్తాడా అని తపించిపోయేది. ఆమెకు నదీతీరాలలో గోప గోపీ జనంతో తిరుగుతున్నట్లు, తామంతా గోపాలుని కోసం వెదుకుతున్నట్లు, ఋషిపత్నులతో యమునాతీరంలో ఎదురుచూస్తున్నట్లు దృశ్యాలు కనిపించేవి. ఆమె భక్తిని చూసి కొందరు ఆమెను రాధ అనికూడా పిలిచేవారు.

తరువాత శారదాదేవికి వివాహము జరగటము, వరుసగా ఆరుగురు పిల్లలు పుట్టిపోవడంతో ఆమెకు జీవితంపై విరక్తి కలిగింది. ఒకనాడు ఒక పంజాబు సాధువు ఇంటికి రాగా వారికి ఆతిథ్యమిచ్చి వారు ఎక్కడ ఉంటారో, ఏమిటో, వారి గురువు ఎవరో అడిగి తెలుసుకున్నది.

కొన్నాళ్ళ తరువాత శారదాదేవి ఆ సాధుపురుషుడు చెప్పిన ద్వారకాకొండలకు వెళ్ళటానికి నిశ్చయించుకుని, ముందు ఉజ్జయిని చేరి, అచ్చట నుండి ఓంకార క్షేత్రానికి పోయి అన్కడ ఒక నదిని దాటి, అరణ్యమార్గంలో అయిదురోజులు నడిచి, ఒక సొరంగం దాటి, చివరకు సిద్ధపురుషులు తపస్సు చేసుకొనే అద్భుతమైన తపోలోకానికి చేరుకున్నది.

అక్కడ బ్రహ్మజ్ఞానసంపన్నులైన తపస్సులు కనిపించారు. ముఖ్యంగా ఐదు గుహలలో ఐదుగురు గురువులు తపస్సమాధిలో ఉన్నారు. శారదాదేవి చెట్లక్రింద మూడు రోజులు జపం చేసుకొంటూ గడిపింది. నాలుగవనాడు సద్గురు మహరాజ్ తపస్వి వచ్చి 'వారిలో ఏ గురువు కావాలి నీకు?' అని అడిగారు. ఆ తపస్వికి 360 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. ఆ గుహలలో సమాధి స్థితిలో ఉన్న ఐదుగురిలో ఒకరిని ఆమె ఎన్నుకున్నది. అప్పుడు ఆ తపస్వి మహరాజ్ 'నీవు ఎన్నుకొన్న ఆ గురువు పేరు చంద్రయోగి!' అన్నారు.



బాబ్జి





# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన వియ్యపు చిన్న

పరవాడ: పరవాడ మండలం రావాడ పంచాయతీపరిది శివారు గొల్లగుంట లో ప్రజలకురంజాన్ సందర్భంగా జిల్లాతెలుగుయువత అర్గనైజింగ్ కార్యదర్శి వియ్యపుచిన్నా ఇప్తారు విందు అందజేశారు. అనంతరమువారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమము లో షేక్.యాసిన్,మదీనా, ఖలిల్ , బషీర్,మునవర్ ఆలీ, ఆలీ మిస్కిన్, ఆనంద్, సూరిబాబు, నాయుడు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో ఈదుల్ ఫితర్ నమాజ్

**వేలసంఖ్యలో తరలి వచ్చిన ముస్లిం సోదరులు ...**
**సంప్రదాయ వస్త్రలతో కనువిందు చేసిన చిన్నారులు .....**



కంచరపాలెం : జివియంసి 40 వ వార్డు పరిది డాక్టర్ జాకీర్ హుస్సేన్ నగర్ మస్జీద్ -ఈ -అల్ ఖదీర్, మర్రిపాలెం మస్జీద్ వీధి వద్ద నున్న మస్జీద్ -ఈ -అల్ ఫత్ లో బుదవారం ఉదయం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు రంజాన్ పండుగ పురష్కరించుకొని వేకువజామున మస్జీద్ వద్ద ముస్లిం సోదరులు ఫజర్ నమాజ్ ఆచరించారు. అనంతరం మర్రిపాలెం ప్రధాన రహదారి వద్ద నున్న ఈద్గా (ప్రార్ధన స్ధలం) వద్దకు చుట్టుప్రక్క ప్రాంతలనుండి వేల సంఖ్యలో చేరుకున్న ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ఈదుల్ ఫితర్ నమాజ్ ఆచరించారు.

హిమాం ( ముస్లిం మత గురువు ) తక్రిర్ పఠించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరి కొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ శుభకాంక్షలు తెలుపు కుంటూ పెద్ద ఎత్తున పేద ప్రజలకు దాన ధర్మాలు చేశారు. అంతకుముందు మస్జీద్ ప్రాంగణం వద్ద నుండి తక్ బీర్ పఠిస్తూ ర్యాలీగా ఈద్ నమాజ్ ప్రాంగణానికి చేరుకున్నారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు సంప్రదాయ వస్త్రలతో అలరించారు.



# పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు పంపిణీ



మధురవాడ : మహా విశాఖ ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పీఎంపాలెం ఫ్రెండ్స్ వనిత వాకర్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో పర్యావరణ ప్రేమికులు పీఎంపాలెం నుంచి కార్ షెడ్ జంక్షన్ వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగ పీఎంపాలెం ఫ్రెండ్స్ వనిత వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ విజయలక్ష్మీ మాట్లాడుతూ మానవుడు తన మేధో సంపత్తితో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని, ప్రపంచవ్యాప్తంగా పలు పరిశ్రమలను నెలకొల్పుతున్నాడు. ఈ పరిశ్రమలు వెదజల్లే కాలుష్యంతో కోలుకోలేనంతగా వాతావరణం కలుషితమై... పీల్చే గాలి, త్రాగే నీరు, తినే ఆహారం.. అన్నీ కలుషితమవు తున్నాయన్నారు. అలాగే అంబెడ్కర్ ఆర్మీ తరుపున పీఎంపాలెం క్రైమ్ కానిస్టేబుల్ బత్తెన శివ ప్రసాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరావు ద్వారా సుమారు 100 మొక్కలను పంపిణిహేశారు ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ వేగవంతమైన జీవితంలో వాహన వేగం పెంచుతూ, ఇంధన కొరతకు కారణమవుతున్నాడు. కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్ లాంటి విషపూరిత వాయువులు వాతావరణంలో పరిమితికి మించి పెరగడం వల్ల క్రమంగా భూమండలం వేడెక్కుతోంది. అడవులు, జల వనరులు క్రమేపీ తగ్గిపోతున్నాయి. ఈ రకంగా, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో సాధించిన పురోగతి కూడా ప్రకృతి కాలుష్యానికి కారణమవుతోందని పలువురు అభిప్రాయపడ్డారు, కార్యక్రంలో ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు దాసరి శ్రీను, కార్యదర్శి భ్రమరాంబ, కోశాధికారి రాజేశ్వరి, సంతోష్ నాయుడు, కాంబ్లీ, తదితరులు పాల్గొన్నారు.

## గొర్లిగోపి ఆర్థిక సహాయంతో ఉచిత మంచినీరు



పరవాడ:పరవాడమండలము గోర్లివానిపాలెంపంచాయితీ పరిదిలో గల జెఎన్ అర్ ఎమ్ కోలనీలో కొన్నిరోజులుగా మంచినీరు ఎద్దడి నెలకుంది. వెంటనే స్పందించిన స్దానిక వైసిపి నాయకులుగోర్లిగోపి అర్దిక సహాయంతో మంచినీరుట్యాంకర్ తో ఉచిత మంచినీరును సప్లయి చేసి ప్రజలు దాహన్నీ తీర్చారు.

# స్వచ్ఛ భారత్‌పై సంక్షిప్త చిత్రంలో పాల్గొనండి

**నగదు బహుమతులు పొందండి .. జివిఎంసి కమిషనర్ హరినారాయణన్**



విశాఖపట్నం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్వచ్ఛ భారత్ అంశాలైన వేస్ట్ సెగ్రిగేషన్ ఎట్ సోర్స్, ఏంటిలిట్టరింగ్, ఓపెన్ డిఫెకేషన్ ఫ్రీ సిటీ, ప్లాస్టిక్ నివారణ, ప్రత్యామ్నాయాలు, స్వచ్ఛ భారత్‌లో బెస్ట్ ప్రాక్టీసెస్, 3 ఆర్ ప్రిన్సిపల్స్ (రెడ్యూస్, రీయూజ్ & రీసైక్లింగ్ ప్రాసెస్)పై 5 నిమిషాల నుండి 10 నిమిషాల నిడివి గల వీడియో చిత్రీకరించడం ద్వారా స్వచ్ఛభారత్‌లో భాగస్వామ్యం కావాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.50,000/-లు, ద్వితీయ బహుమతి రూ. 25,000/-లు, తృతీయ బహుమతి రూ.15,000/-లుగా తెలిపారు. అంతేకాకుండా 10 కన్సొలేషన్ ప్రైజులతోపాటు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది జూన్ 30 కాగా, షార్ట్ ఫిల్మ్ అందజేయడానికి చివరి తేది జూలై 15గా వెల్లడించారు. పూర్తి వివరాల కోసం మొబైల్ 9490077047, ఇ-మెయిల్ అడ్రస్ : gvmc.pmu@gmail.com సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

వేస్ట్ టు బెస్ట్ కాంపిటీషన్ :

పాత ఉపయోగించని వస్తువులను ఉపయోగకరమైన వస్తువులుగా తీర్చిదిద్దడానికి, రూపొందించడానికి వేస్ట్ - టు - బెస్ట్ కాంపిటీషన్ ఉద్దేశించినట్లు వెల్లడించారు. ఈ పోటీలో అన్ని విద్యా సంస్థలు, పాఠశాలలు పాల్గొనవచ్చు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి చివరి తేది జూలై 15వ తేదీగా తెలిపారు. ప్రదర్శన స్థలం, తేది, సమయం తరువాత ప్రకటిస్తారని, ప్రైజులు, కన్సొలేషన్ ప్రైజెస్, సర్టిఫికెట్లు జి.వి.ఎం.సి. అందజేస్తోంది. రిజిస్ట్రేషన్ సంప్రదించుటకు మొబైల్ 9490077047, ఇ-మెయిల్ gvmc.pmu@gmail.com ను సంప్రదించాలని కోరారు.

ఎడాప్ట్ - ఏ వాల్ :

జి.వి.ఎం.సి. పరిధిలోని గోడలను అందంగా తీర్చిదిద్దడానికి ఎడాప్ట్ ఎ వాల్‌కు ఎస్టాబ్లిష్‌మెంట్స్, ఆర్గనైజేషన్స్, ఆర్టిస్టులు, ఆసక్తి ఉన్న వ్యక్తులు పెయింటింగ్ డిజైన్, ఆర్టిస్ట్, పెయింటర్స్‌ను గుర్తించడం చేస్తే పెయింటింగ్ చార్జీలను జి.వి.ఎం.సి. భరిస్తుంది. వివరాలకు మొబైల్ 94900 77047 gvmc.pmu@gmail.comకు సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.


**రేషన్ కార్డు పడిపోయినది**

యానాం సావిత్రనగర్ గ్రామానికి చెందన సంగాని సత్యం, S/o. వరద రాజులుకు చెందిన రేషన్ కార్డు నెం. 466179 పడిపోయినది. మే 27వ తేదీన సావిత్రినగర్‌లో తన ఇంటివద్ద నుండి యానాం ఆఫీసు పనినిమిత్తం వస్తుండగా ఏటిగట్టు రోడ్డుమార్గంలో పడిపోయినది. ఇది ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు తెలియగోరుచున్నాము.

**సంగాని సత్యం**
**S/o. వరద రాజులు**
**డోర్ నెం. 5-10-031**
**సావిత్రి నగర్, యానాం.**
**సెల్ నెం: 9849274358**



**దావా నోటీసు**

**మహారాజశ్రీ విజయనగరం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**O.S.306/16**

**Between :**
శ్రీమతి కోరాడ కుమారి పురఫ్ నరసయ్యమ్మ ...వాది
**and :**
శ్రీ బొమ్మి కొండబాబు (died) వగైరాలు ...ప్రతివాదులు
ప్రతివాదులు (D3) : శ్రీ బొమ్మి రాజేష్ S/o. లేటు కొండబాబు
C/o S.సతీష్‌కుమార్, D.No.8-13-1/A,
ఐనాక్సు థియేటర్ వెనుక, చిట్టి వెంకట రమణ
హాస్పిటల్ దరి, విజయనగరం
D4 : శ్రీ బొమ్మి బానోజిరావు S/o. లేటు కొండబాబు, rest-do-
D5 కుమారి బొమ్మి భాగ్య D/o లేటు కొండబాబు, rest-do-

పై నెంబరు దావాలో వాదిగారు మీపై పైకోర్టులో దావా పరిహారము కోరుతూ దావా వేసి యున్నారు. సదరు దావాలో మీ తరపున ఆక్షేపణలు యున్న యెడల యీ నోటీసు చూసిన వెంటనే, మీరు గాని మీ ఆర్డరు పొందిన వకీలు గారి ద్వారా గాని, పై కోర్టులో **తే:13-06-19దీన ఉ 10-30 ని॥** హాజరు అయి మీ తరుపు వాదన తెలియపర్చుకోవలెను. లేనిచో వాయిదా దినమున మీ పరోక్షమందు తీర్మానం చేయడమగునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

విజయనగరం
Dt 15-5-19

ఇట్లు
శ్రీ Ch.చంద్రశేఖర్
వాది తరపున అడ్వకేట్
విజయనగరం.


# కారు ఢీకొని యువకుడు మృతి

## మరో ఇద్దరికి గాయాలు



మృతుడు రాజేష్

ములగాడ: శ్రీహరిపురం ప్రభుత్వ పాఠశాల వద్ద అరుగు బయట కూర్చున్న యువకులపై కారు ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందారు ఈ ప్రమాదంపై మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జీవీఎంసీ 46 వార్డు పరిధిలో గల దిగువ గొల్లపాలెంలో జీవీఎంసీ పాఠశాల వద్ద సిమెంట్ దిమ్మ మీద కూర్చుని మాట్లాడుతుండగా అదే సమయంలో యజమాని బోసు అనే వ్యక్తి కారు నెంబరు ఏపీ 31 టి కె 1644 తీయడానికి ప్రయత్నించగా ఒక్కసారిగా ఈ ముగ్గురు పై కారు దూసుకుపోవడంతో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలపాలయ్యారు వీరిని అక్కడ ఉన్న స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా తీరుకుటి రాజేష్(32) మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు మరో ఇద్దరు ఆనంద్ సంతోష్ చికిత్స పొందుతున్నారని కారు యజమాని పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు రాజేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెహెచ్ తరలించారు మల్కాపురం సీఐ లంక భాస్కర రావు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# ఘనంగా రంజాన్ వేడుకలు



గాజువాక: పారిశ్రామిక ప్రాంతంలో ముస్లీం సోదరులు ఘనంగా రంజాన్ వేడుకులను నిర్వహించారు. నెలరోజుల పాటు కఠోర ఉపవాసాలను పాటించిన ముస్లీంలు మంగళవారం రాత్రి నెలవంకదర్శనంనతో ఉపవాసాలు విరమించారు. రంజాన్ సందర్బంగా బుధవారం ఉక్కునగరం, పెదగంట్యాడ, గాజువాక, అజీమాబాద్,కూర్మన్నపాలెం, అక్కిరెడ్డిపాలెం, తుంగ్లాం, శ్రీహరిపురం, మల్కాపురం తదితర ప్రాంతాలలో ఉన్న ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేసారు. ముస్లీంలంతా ఒకే చోట చేరడంతో సందడి వాతావరణ నెలకొంది. ఒకరినోకరు అలింగనం చేసుకొని ఈధ్‌ముబారక్‌ను తెలిపుకున్నారు. ఈ సంధర్బంగా ముస్లీం పెద్దలు మాట్లాడుతూ రంజాన్ సంధర్బంగా నెలరోజులు పాటు చేసిన ఉపవాస దీక్షలు అత్యంత గొప్పదని అన్నారు. ప్రతీ ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్ధించినట్లు తెలిపారు.

సింథియా శ్రీహరిపురం కోరమండల్ సమీపంలోని దర్గాలో ముస్లీం సోదరులు అత్యంత భక్తి శ్రద్దలతో పవిత్ర రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 30రోజులు ఉపవాసం అనంతరం బుధవారం దర్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్ధనలను నిర్వహించారు. రంజాన్ యొక్క ప్రత్యేకతను ముస్లీం పెద్దలు వివరించారు. అనంతరం ఒకిరినొకరు అలింగనం చేసుకొని ఈధ్‌ముబారక్‌ను తెలుపుకున్నారు. సర్వమత హితం కోసం అందరం కలిసి ఉండాలని, సోదరభావంతో మెలగాలని, అన్ని మతాల సారాంశం ఒకటేనని ముస్లీం పెద్దలు ఉపదేశించారు. ఈ వేడుకలలో పారిశ్రామిక ప్రాంతంలోని ముస్లీం పెద్దలు గౌస్‌మోహిద్దీన్, ఇబ్రహీం, ఎస్.కె.వల్లీ, మహ్మద్, అర్ఫిక్, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఈ నెల 8 నుంచి అవంతి టి-10 క్రికెట్ టోర్నమెంట్



భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గ పరిధిలోని యువకులను క్రీడారంగంలో ప్రోత్సహించాలనే ఉద్దేశ్యముతో భీమిలీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదిన సందర్బంగా హాసిని ఎస్టేట్స్ అండ్ కన్స్ట్రక్షన్స్ ఎం.డి ఎ.వి.వర్మ రాజు ఆధ్వర్యంలో హాసిని ఎస్టేట్స్ స్పాన్సరుషిప్ తో అవంతి టి10 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని హాసిని వర్మ రాజు తెలియజేశారు. దీనికి సంబంధించిన బ్రోచేర్ ను స్థానిక ఎమ్మెల్యే అవంతి కార్యాలయంలో బుధవారం ముత్తంశెట్టి మహేష్ చేతుల మీదుగా విడుదల జేశారు. ఈ సందర్బంగా మహేష్ మాట్లాడుతూ భీమిలి శాసన సభ్యులు అవంతి శ్రీనివాసరావుకి క్రీడలు యందు ఎంతో ఆసక్తి ఉందని గతంలో కూడా ఎమ్మెల్యే కప్ టోర్నమెంట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారని అన్నారు. ఈ సంవత్సరం ఎమ్మెల్యే గారి మీద అభిమానంతో ఈ టోర్నమెంట్ హాసిని సంస్థ వారు నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని గెలుపు ఓటముల గురించి చూడకుండా భీమిలి నియోజకవర్గ యువకులు ఈ టోర్నమెంట్ లో పాల్గొనాలని కోరారు. హాసిని వర్మ రాజు మాట్లాడుతూ విన్నర్ కు 25000 క్యాష్ ప్రైజ్, రన్నర్ అప్ కు 15000 క్యాష్ ప్రైజ్ తో పాటు, మాన్ ఆఫ్ ద సిరీస్ మరియు బెస్ట్ బ్యాట్స్ మెన్ , బెస్ట్ బౌలర్ ప్రైజ్ లు ఉంటాయని తెలిపారు. రేపు అనగా 6 వతేదీ గురువారం నుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని 7వ తారీఖున డ్రా తీసి 8వ తారీఖు నుండి 11 వరకూ మ్యాచ్ లు భీమిలి క్రికెట్ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలకు ఆర్గనైజింగ్ కమిటీ మెంబెర్స్ గా ఎం. సూర్య శ్రీనివాస్, కుమార్ రాజా, మొకర నర్సింగరావు ,ఆర్ ప్రభా కర్ నాయుడు, మొకర వెంకటేష్ వ్యవహరిస్తారని అన్నారు ఇందులో పాల్గొనే జట్లు రిజిస్ట్రేషన్ కొరకు 89853 68606, 91 77953315 ఫోన్ నంబర్ లను సంప్రదించాలని కోరారు. ఈ టోర్నమెంట్ నాకౌట్ ప్రక్రియలో జరుగుతుందని 11వ తారీఖు న ఫైనల్ మాచ్ జరుగుతుందని భీమిలి శాసనసభ్యులు అవంతి శ్రీనివాసరావు జన్మదిన సందర్భంగా ఈ నెల 12వ తారీఖు న గెలిచినవారికి బహుమతులు అవంతి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేస్తామని హాసిని సీ ఈ ఓ డి.వి.వి.ఎస్ వర్మ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి వైసీపీ నాయకులు ముత్తంశెట్టి మహేష్, హాసిని ఎస్టేట్స్ సీఈఓ డి.వి.వి.ఎస్ వర్మ, మేనేజింగ్ డైరెక్టర్ ఏ. వి.వర్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడండి..అది మనల్ని కాపాడుతుంది

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



విజయనగరం : ఓ జోన్ పొర బలపడటానికి, కాలుష్యం నుంచి ప్రకృతిని కాపాడటానికి, భవిష్యత్ తరాల వారికి కాలుష్యం లేని వాతావరణం అందించాలంటే భూమిపై ఉన్న 23 శాతం అటవీ సంపద చాలదని, జాతీయ పర్యావరణ గణాంకాల ప్రకారం దేశంలో 33 శాతం అటవీ సంపద ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రజలు మొక్కలు నాటాలని వాటిని పరిరక్షించి వృక్షాలుగా తయారు చేయాలని అన్నారు. నాటిన ప్రతిమొక్క ంరబతికించాలని తెలిపారు. మానవ మనుగడకు గాలి, నీరు, వాతావరణం, ప్రాణవాయువు అవసరమని ఇవన్ని మనకు లభించాలంటే మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మద్యవర్తిత్వ హెల్‌పడెస్క్ ప్రారంభం: ప్రిలిటిగేషన్ కేసుల హెల్ప్‌డెస్క్ (క్లినిక్) ని జిల్లా న్యాయ సేవా అధికారిక సంస్థ భవనంలోజిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్ ప్రారంభించారు. దీనిలో వివాహ సంబంధించిన కేసులు మద్యవర్తిత్వం ద్వారా కౌన్సిలింగ్ చేసి పరిష్కరిచడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధమశ్రేణి జిల్లా న్యాయమూర్తి ఎ.వరప్రసాదరావు, ఎస్‌సి, ఎస్.టి స్పెషల్ జడ్జి , నాల్గవ శ్రేణి ప్రధాన న్యాయమూర్తి వై.హేమలత, అడిషనల్ సివిల్ జడ్జి బి.శిరీష. సీనియర్ సివిల్ జడ్జి కె.రాంబాబు, డిఎల్ఎస్ఆర్ ఎ కార్యదర్శి వి.లక్ష్మిరాజ్యం, స్పెషల్ జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేసిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎం.వి.వెంకటశేషమ్మ, ఎపిపి మాధవి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షఋలు కలిశెట్టి ఈశ్వరరావు, సీనియర్ న్యాయవాది కె.తమ్మన్నశెట్టి, న్యాయవాదులు, కోర్ట్ సూపరింటెండెంట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గణబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీ సత్యసాయి ట్రస్ట్ సభ్యులు



ములగాడ: పారిశ్రామిక ప్రాంతం 47వార్డు పరిధిలోగల శ్రీహరిపురం గొల్లపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నిత్య అన్నదానం కార్యక్రమాన్ని బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాల నుండి శ్రీ సత్య సాయి చారిటబుల్ ట్రస్ట్ సేవా అందిస్తున్నారు.

ఇందులో భాగంగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు మరల ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే కార్యా లయం నందు బ్రహ్మకుమారి ఎమ్మెల్యే గణబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ మీ సంస్థకు ద్వారా ఎంతోమంది పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని మీ సంస్థకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మాట తప్పడు. మడమ తిప్పడు మన మల్లాడి..



యానాం : కేంద్ర పాలితప్రాంతమైన యానాం అసెంబ్లీ నియోజకవర్గంలోని రపజలకు అనునిత్యం సేవలు అందిస్తూ ప్రజల ఆరాధ్యకుడుగా కీర్తికెక్కిన పుదుచ్చేరి ఆరోగ్య, పర్యాటక, మత్స్య, క్రీడలు, కళలు, పౌర విమానయాన మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని మర్చిపోకుండా పూర్తి చేసి మాట తప్పడు.. మడము తిప్పని నైజంగా మల్లాడి కృష్ణారావు ఖ్యాతిని ఆర్జించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తానున్నానంటూ వారి బాధలను, కష్టాలను పరిష్కరించే వరకూ పని చేస్తూనే వుంటారు. పుదుచ్చేరి నుండి యానాం వస్తున్నారని తెలుసుకుని మంత్రి మల్లాడి ఇంటికి చేరుకుంటారు ప్రజలు. వారి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేసేందుకుగాను ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు విన్నవించుకుంటూనే ఉంటారు. దీంతో మంత్రి ప్రజల సమస్యలు తీర్చడానికి కృషి చేస్తూ ఉంటారు. నియోజకవర్గంలోని ప్రతీ వ్యక్తినీ పేరుపెట్టి పిలవడం ఆయనకే సాధ్యం. అంటే ప్రజలతో అంత మమేకమై ఉంటారనడంలో సందేహం లేదు. ఎక్కడైనా ఏదైనా సభా కార్యక్రమం జరిగిందంటే మల్లాడి పిలిస్తే తప్పకుండా జనం తండోపతండాలుగా వచ్చి చేరు తుంటారు. తమ అభిమాన నాయకునికి విజయం కలగాని ప్రార్థించని మానవుడు లేడంటే నమ్మశక్యం కాదు. అది కేవలం మల్లాడికే దక్కింది. యానాంను అన్ని రంగాలలో మంత్రి మల్లాడి అభివృద్ధి చేశారు. కేంద్రం నుండి 250 కోట్లతో యానాంలో జిప్‌మెర్ ఆసుపత్రి బ్రాంచి కార్యాలయాన్ని నిర్మాణానికి తొలివిడతగా 50 కోట్ల రూపాయలు విడుదల చేయించారు. సావిత్రినగర్‌లో 20 కోట్లతో మినీ షిపింగ్ హార్బర్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. గోపాల్ నగర్‌లో 9 కోట్లతో 50 పడకల ఆయుష్ ఆసుపత్రి నిర్మాణ పనులకు నిధులు కేటాయించారు. అంతే కాకుండా సుమారు 5 కోట్లతో మత్స్య శాఖ కార్యాలయం వెనుక అంబేద్కర్ విజ్ఞాపన కేంద్రం నిర్మాణ పనులు పూర్తి చేయించారు. ఇది పూర్తయితే ఉన్నత విద్య, పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు అవకాశముంటుందన్నారు. ప్రధాన పంటకాల్వపై 2 కోట్లతో కాంక్రీట్ నిర్మాణ పనులతో రోడ్డు ఆధునీకరణ పనులు చేపట్టారు. పిల్లంకి నుండి దరియల తిప్ప వరకూ భూగర్భ పైపు లైన్ పనులు 25 కోట్లతో చేపట్టి లంక భూముల్లోని ఎస్సీ రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనులు చేపట్టారు. సుమారు 15 కోట్లతో సావిత్రి నగర్ నుండి కనకాలపేట వరకూ రోడ్డు ఆధునీకరణ పనులు చేపట్టారు. గిరియంపేటలో సుమారు 25 కోట్లతో జాతీయ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఓబ్లిక్ టవర్ చుట్టూ రిలయన్స్ నిధులు సుమారు 16 కోట్లతో చుట్టూ పార్క్ అభివృద్ధి పనులు చేపట్టారు. పర్యాటక రంగం ద్వారా విశేషంగా పర్యాటకులను ఆకర్షించేందుకు ఐలాండ్ భూములలో మడ అడవులలో చెక్కవంతెనను సుమారు 6.50 కోట్లతో 3 కిలో మీటర్ల మేర నిర్మింపజేసిన ఘనత మల్లాడికే దక్కింది. సముద్ర అందాలు, లంకలు సుందర దృశ్యాలు చూసేందుకు షీగల్స్ రెస్టారెంటు నుంచి అధునాతన బోట్లను ఏర్పాటు చేయించారు. స్థానిక దాక్షారామం రోడ్డు మార్గంలోగల వైఎస్ఆర్ బొటానికల్ గార్డెన్‌ను 9 కోట్లతో ఆదునీకరించి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రజలకు తాగు నీరు పుష్కలంగా అందించేందుకు భూగరభ పైపు లైను పనులను 10 కోట్లతో చేపట్టాలని పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి. నారాయణ సామికి ప్రతిపాదనలు పంపించారు.ఇలా ఎన్నో భారీ నిధులు కేటాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించి యానాంను అభివృద్ధి పధాన పయనింపజేస్తున్న ఘతన మల్లాడికే దక్కుతుంది.



### యానాంకు ప్రత్యేక హోదా ఇవ్వాలి : మంత్రి మల్లాడి

యానాం : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పక్షంలో సరిహద్దులో వున్న కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి పరిధిలో వున్న యానాంకు ప్రత్యేక హోదాను వర్తింపుచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి(జగన్)కి పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో జగన్‌తో సుమారు 30 నిముషాలు పాటు సమావేశమై అనేక అంశాలపై చర్చించారు. యానాంకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించాలని పుదుచ్చేరి ప్రభుత్వ పరంగా అనేక డిమాండ్లను సిఎం జగన్ దృష్టికి అంశాలవారీగా చర్చించారు. తన పరిధిలో వున్న అన్ని అంశాలను నూటికి నూరు శాతం పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని జగన్ హామీ ఇచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను రెండు రాష్ట్రాలుగా విభజించినప్పుడు ఎన్నో విధాలుగా నష్టపోయిందని విషయాలపై అప్పట్లో కేంద్రప్రభుత్వంనకు వినతిపత్రాలను ప్రధానమంత్రి, రాష్ట్రపతి, హోంమంత్రి, కేంద్ర మంత్రులకు వేలాది సంతకాలతో కూడిన డిమాండ్‌ల వివరాలను, నివేదికలను

తరువాయి 7లో..












# మాట తప్పడు. మడమ తిప్పడు మన మల్లాడి..



( 6వ పేజీ తరువాయి )

అందిం చడం జరిగిందన్నారు. ఆనాటి విషయాలు గురించి జగన్‌కు వివరించామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన రాయితీలు, ప్రోత్సాహకాలు, అఖిల భారతస్థాయి విద్య, వైద్య సంస్థలు ఏర్పాటు, పరిశ్రమలు ఏర్పాటు రాయితీలు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారో అదేవిధంగా యానాంకు కల్పించాలని తాను అప్పట్లో కేంద్రాన్ని కోరడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా జాతీయ ఇంజనీరింగ్ కళాశాల, జిప్‌మర్ ఆసుపత్రులను కేంద్ర నిధులు సాధించడంపై జగన్‌కు వివరించామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా అంకురిత దీక్షతో దానిని సాధించడమే ధ్యేయంగా ఇప్పటికి ప్రత్యేక హోదా డిమాండ్‌ను సజీవంగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయేలా చేసిన వైఎస్ఆర్ పార్టీ అద్భుత విజయాలను సాధించి ప్రజల ఆకాంక్షలను తీర్చే పార్టీ ప్రజల నమ్మకం పొందిందని మంత్రి మల్లాడి తెలిపారు. యానాంకు సంబంధించిన పలు డిమాండ్‌లను సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్ళారు. అంతరరాష్ట్ర మద్యం రవాణా పర్మిట్‌లకు రూట్ పర్మిట్ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని, ఉభయ రాష్ట్రాల భూముల జాయింట్ సర్వేను నిర్వహించాలని, తూర్పుగోదావరి, యానాం ప్రాంతాలకు చెందిన మత్స్యకారులకు ఎన్నో ఏళ్ళు నుండి పెండింగ్‌లో వున్న జిఎస్‌పిసి నష్ట పరిహారాన్ని పూర్తి స్థాయిలో చెల్లించేలా సహకరించాలని మంత్రి మల్లాడి కోరారు. లేదంటే ఓఎన్‌జిసి ద్వారా నష్ట పరిహారం చెల్లించేలా సహకరించాలని మంత్రి మల్లాడి కోరారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రిని కలిసి మత్స్యకారులకు రావలసిన బకాయిలు, దీర్ఘకాలిక సమస్యకు తెరపడేలా తన వంతు ప్రయత్నం చేస్తానని సిఎం జగన్ హామీ ఇచ్చారన్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో వున్న మల్లాడి సత్సలింగ నాయకర్ ట్రస్టుకు చెందిన 1250 ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని, వందలాది ఎకరాల్లో వుంటూ కనీస మొత్తాలలో శిస్తు సహితం చెల్లించడం లేదని, ఎంఎస్‌ఎన్ దాతృత్వ సంస్థ ఎన్నో ఇబ్బందులు, అంతర్వేది ఆలయం భూముల సమస్యను పరిష్కరించాలని మంత్రి మల్లాడి కోరారు. భూముల వివాదాలపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించేందుకు నిజాయితీ కలిగిన అధికారులు నియమించాలని కోరారు. తాను లేవనెత్తిన డిమాండ్‌పై సానుకూలంగా సిఎం జగన్ స్పందించారని మంత్రి మల్లాడి తెలిపారు.

### నేడే 'మన భోజనం' ప్రారంభం

యానాం : యానాం పరిసర ప్రాంత ప్రజలకు మంచి భోజనం అందించేందుకు దాతల సహకారంతో ఓల్డేజ్ హోమ్ ద్వారా 'మన భోజనం' పథకాన్ని పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. గురువారం ఉదయం ఓల్డేజ్ హోమ్ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లాడి కృష్ణారావు పుట్టిన రోజును పురస్కరించుకుని ఐఎఫ్‌సిఐ న్యూఢిల్లీ వారి ద్వారా స్పాన్సర్ చేయబడిన మొబైల్ ఫుడ్ ట్రక్‌ను మంత్రి మల్లాడి నేతృత్వంలో డా. ఇ.శంకరరావు, ఎడి అధికారుల చేతుల మీదుగా విశిష్ట అతిథుల సమక్షంలో అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపంలో ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

# 1.80 లక్షల గ్రామ వలంటీర్లు!

## ప్రాథమికంగా అంచనా .. స్థానికులకు ప్రాధాన్యం

## ఎంపికకు మొదలైన కసరత్తు

## పట్టణాల్లోనూ 70 వేల మందికి అవకాశం

## ముఖ్యమంత్రితో చర్చించాక మరింత పెరిగే వీలు

అమరావతి: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడటంలో క్రియాశీలక పాత్ర పోషించేలా గ్రామాల్లో వలంటీర్ల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం 13 జిల్లాల్లో 1.80 లక్షల మందిని నియమించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులతో మంగళవారం సమావేశమై ఈ అంశంపై చర్చించారు. కొద్ది రోజుల్లోనే ముఖ్యమంత్రితో చర్చించాక ఆయన సూచనల మేరకు అవసరమైన సవరణలు చేసి అమలుకు ఆదేశాలు జారీ చేయనున్నారు. గ్రామాల్లో యాభై కుటుంబాలకో వలంటీర్‌ను నియమించి నెలకు రూ.5 వేలు చొప్పున వేతనం చెల్లిస్తామని ప్రమాణ స్వీకారోత్సవ సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే.

ఆగస్టు 15 నుంచి వలంటీర్ల వ్యవస్థ అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి హామీపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 90 లక్షల కుటుంబాలున్నాయని రెండేళ్ల క్రితం నిర్వహించిన ఒక సర్వేలో వెల్లడైంది. వీరిలో 50 కుటుంబాలకో వలంటీర్‌ను నియమించాలంటే ఎంతమంది అవసరమవుతారు? ఏవిధంగా ఎంపిక చేయాలి? ఇందుకు అనుసరించాల్సిన విధానం తదితర అంశాలపై జవహర్‌రెడ్డి తాడేపల్లిలోని సంచాలకుని కార్యాలయంలో అధికారులతో ప్రధానంగా చర్చించారు. ప్రాథమిక లెక్కల ప్రకారం 1.80 లక్షల వలంటీర్లు అవసరమని ప్రతిపాదించినా.. ముఖ్యమంత్రితో సమావేశం తరువాత ఈ సంఖ్యను పెంచుతారా? అనేది చూడాలి. ఎందుకంటే..జగన్‌మోహన్‌రెడ్డి 4 లక్షల మందిని నియమిస్తామని వెల్లడించిన విషయం తెలిసిందే. వలంటీర్ల ఎంపికకు పదో తరగతి కనీస విద్యార్హతగా నిర్ణయించనున్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు ప్రాధాన్యమిస్తారు. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఎంపికలో స్థానికులకు ప్రాధాన్యమివ్వనున్నారు. దరఖాస్తులను మీ-సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో స్వీకరించి మండల స్థాయి అధికారులతో ఏర్పాటుచేసే కమిటీ అర్హులను ఎంపిక చేస్తుంది. ముఖ్యమంత్రితో చర్చించాక విధివిధానాలు ఖరారు చేసి అధికారిక ప్రకటన చేయనున్నారు. ముసాయిదా దశలో ఉన్నందున ఈ అంశంపై ఎక్కువగా మాట్లాడేందుకు అధికారులు సుముఖత చూపడం లేదు.

నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లోనూ ప్రతి యాభై కుటుంబాలకో వలంటీర్‌ని ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. పట్టణాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వార్డులు/ డివిజన్ల వారీగా కూడా అవసరమని భావించి ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. 110 పట్టణ స్థానిక సంస్థల్లో 70 వేల మందిని నియమించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఘనంగా రంజాన్ వేడుకలు



మధురావాడ : మహా విశాఖ 4,5 వార్డులలో బుధవారం ముస్లిం సోదరిసోదరలు నలభై రోజుల దీక్షలా అంతరం ఎంతో భక్తి శ్రద్దలతో ఆనందంగా జరుపుకునే పండుగ ఈదముబారక్‌ను ఘనంగా అందరూ కలిసి ఆనంద ఉత్సవాలతో అంగరంగ వైభోగంగా జరుపుకున్నారు. పీఎంపాలెం ముస్లిం కాలనీలో గల మసీదులో కుటుంబాలతో కలిసి వెళ్లి తమ అల్లాను ప్రార్దించి నమాజ్ చేసి పరస్పరం ఆలింగనంచేసుకొని ఒకరినిఒకరు అబినందించుకొన్నారు.

దీనితో మసీదు ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది ఈ కార్యక్రంలో అథక్ష్యుడు హాజీ షేక్ సుభాని, కోలోని ప్రసిడెంట్ రెహమాన్, యూత్ ప్రెసిడెంట్ అప్ప సాహెబ్, షేక్ భసీర్ తదితరులు పాల్గొన్నారు.

## నాగావళి, చంపావతి నదుల అనుసందానంతో త్రాగునీటి సమస్య పరిష్కారం కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు



విజయనగరం : నాగావళి, చంపావతి నదుల అనుసందానం ద్వారా విజయనగరం పట్టణంలో త్రాగునీటి సమస్యకు కొంతమేర పరిష్కారం లభిస్తుందని మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. తోటపల్లి రిజర్వాయర్ నుండి విడుదలైన నీరు గడిగెడ్డ ద్వారా చంపావతి ఊటబావుల వద్దకు చేరుకున్న నీటి ప్రవాహాన్ని బుధవారం మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు ఆధ్వర్యంలో పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి ప్రవాహానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ 2015వ సంవత్సరంలోనాగావళి నదిని చంపావతితో అనుసందానం చేసి ప్రణాళికలను సిద్ధం చేసామన్నారు.

# 10న కళాకారుల సమావేశం

విశాఖపట్నం : విశాఖ కళాసంఘాల సంక్షేమ సంఘం (వికసం) సర్వసభ్య సమావేశం ఈ నెల 10న సాయంత్రం 6 గంటలకు వైశాఖి జల ఉద్యానవనంలో జరగనున్న వికసం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. గానం, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, మిమిక్రీ తదితర అంశాలకు చెందిన కళా సంస్థలతో పదేళ్ల క్రితం స్థాపించబడిన ఈ సంఘ సమస్యల పరిష్కారం కొరకై కార్యాచరణ ప్రణాళిక రూపొందించుట కొరకు జరగనున్న ఈ సమావేశంలో కళాసంస్థల అధ్యక్ష, కార్యదర్శులతోపాటు ఇటీవల ఆవిర్భవించిన పలు సంస్థలు కూడా 10వ తేదీన జరిగిన సమావేశంలో మా యొక్క సంస్థల పేర్లను నమోదు చేసుకోవలసిందిగా చెన్నా తిరుమలరావు కోరారు. అన్ని వర్గాలకు సంబంధించిన కళా సంస్థల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 99484 45267 నెంబరులో సంప్రదించవలసిందిగా పేర్కొన్నారు.

# సింహగిరిపై ఘనంగా పర్యావరణ దినోత్సవం మరియు విత్తనాల పండగ

సింహాచలం : సింహగిరిపై ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరియు విత్తనాల పండగ బుధవారంనాడు ఘనంగా నిర్వహించారు .ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ఉదయం 7.00 గంటలకు సంకల్ప కళా గ్రామం, ఎకో ఫ్రెండ్స్ నర్సరీ మరియు రైతుమిత్ర, జె.సి.ఐ వైజాగ్ గ్రూపు స్వచ్ఛంద సంస్థల సభ్యులు సింహాచలం కొండపై గుడి పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరివేసి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని పూర్తి చేసి తదుపరి సుమారు 600 కిలోలు సేంద్రీయ ఎరువుతో తయారు చేసిన విత్తన బంతుల్ని జల్లారు ఈ కార్యక్రమంలో బాగరంగా సుమారు 80 మంది సభ్యులు బృందాలుగా ఏర్పడి సింహగిరిపై సత్తెమ్మ తల్లి ఆలయం , హిల్ టాప్ రోడ్డు , కైలాష్ గిరి వెళ్లే మార్గంలో ఉదయం నుంచి విత్తన బంతులు జల్లారు . శ్రీ వరహా లక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానం కార్యనిర్వాహక అధికారి శ్రీరామచంద్రమోహన్ వారి పర్యవేక్షణలో , దేవస్థానం స్థపతి శ్రీ అమ్మన రాజు, రేంజర్ ఉమా మహేశ్వర రావులు పాల్గొన్నారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులు శ్రీ చలపతి రావు ( సంకల్ప కళాగ్రామం) రాంబాబు కర్రి, వర్మ దాట్ల (రైతు మిత్ర ) సాయి వర్మ, శివ శంకర్ (జె.సి.ఐ వైజాగ్) వారి గ్రూప్ సభ్యులతో పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు



ములగాడ: మొక్కలను విడివిడిగా పెంచాలని ప్లాస్టిక్ వాడకాన్ని కనీసస్థాయికి తగ్గించాలని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ పి రవి కుమార్ అన్నారు స్థానిక 48వ పరిధిలోగల మల్కాపురం ప్రకాష్ నగర్ నందు గ్రంథాలయంలో గత నలభై మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ సేల్స్ అచ్యుత్ కుమార్ పాల్గొని ఆయన మాట్లాడుతూ వాహనాల వాడుకాలను తగ్గించాలని దగ్గర ఉన్న ప్రదేశాలు నడిచి లేదా సైకిల్ మీద వెళ్లాలని వారానికి ఒక్క రోజు ప్రజలంతా మోటార్ సైకిల్ కార్లను వినియోగించకుండా ప్రజా రవాణా ఉపయోగిస్తే ఎంతో కాలుష్య ఎంతోకాలం నివారించ వచ్చన్నారుఅనంతరం ఈ దశలో భాగంగా చిన్నారులకు హెచ్పీసీఎల్ సౌజన్యంతో చిత్రలేఖనం మరియు వ్యాసరచన పోటీలను నిర్వహించారు ఈ పోటీలు వాయు కాలుష్య నివారణ పై చిన్నారులకు అద్భుతంగా చిత్రాన్ని ఆవిష్కరించారు విజేతలకు బహుమతులను అందజేస్తూ చిన్నారులందరికీ పర్యావరణ దినోత్సవం లో పాల్గొన్న విద్యార్థుల వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అజయ్ కుమార్ వ్యాస శిక్షణా శిబిరాలు నోడల్ అధికారి ఏవీవీఎస్ మూర్తి జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపీఎస్ భాగ్యలక్ష్మి రచయితల సత్తిరాజు సత్యానందం జాతీయ ప్రోగ్రాం అధికారి అనసూయదేవి సామాజిక కార్యకర్త కెవిఎస్ నరసింహారావు అధికారులు మణి బాబు ఉపాధ్యాయులు సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గీతం 'వర్సిటీ' వైస్-ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ



సాగర్‌నగర్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ,కర్ణాటక రాష్ట్రాలలో ప్రాంగణాలు గల గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నూతన వైస్- ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ కె. శివ రామ కృష్ణ నియమితులయ్యారు. బుదవారం వైస్-ఛాన్సలర్‌గా భాద్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కె.శివరామకృష్ణను గీతం అధ్యక్షులు ఎమ్.శ్రీభరత్, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగాధర రావు, గీతం కార్యదర్శి బి.వి.మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శి ఎమ్.భరద్వాజ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ కలసి అభినందనలు తెలిపారు.

సింబయాసిస్ సి.ఇ.ఓ నరేష్ కుమార్ సహ పలువురు నగర ప్రముఖులు, పూర్వ విద్యార్థులు,భోధన.భోధనేతర సిబ్బంది హజరై గీతం నూతన వైస్ ఛాన్సలర్‌కు అభినందనలు తెలిపారు.

# స్టేట్ స్ట్రాంగ్ ఉమెన్‌గా రాజాన పూర్ణ



అనకాపల్లిః గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అనకాపల్లి ఎస్. ఆర్. డి. జిమ్ కు చెందిన రాజనాల పూర్ణ అనే క్రీడాకారిణిని విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడంతో పాటు స్టేట్ స్ట్రాంగ్ ఉమెన్ గా నిలిచింది. పూర్ణ గతంలో కూడా అనేక సందర్భాల్లో పలు పతకాలు సాధించి అనకాపల్లి ఖ్యాతి పెంచింది. ఏ పోటికి వెళ్లినా ఖచ్చితంగా పతకం నెగ్గుకురావడం పూర్ణకే చెల్లిందని తోటి క్రీడాకారులు కొనియాడుతున్నారు. అలాగే ఆమెకు పవర్ లిఫ్టింగ్ ప్రాక్టీసులో ఉన్నతమైన శిక్షణ ఇచ్చిన జిమ్ కోచ్ నీలాకు కూడా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విజయం పట్ల జిమ్ అధ్యక్షుడు బొద్దపు ప్రసాద్ తో పాటు పాలకవర్గం ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

### నేటినుండి కామాక్షి అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజలు

విజయనగరం: స్థానిక బొండాడవీధిలో ఉన్న కామాక్షిసమేత ఏకాంబరేశ్వర స్వామివారి ఆలయం పునర్నిర్మాణాన్ని పురస్కరించుకుని ఈనెల 5వ తేది నుండి 9వ తేది వరక ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ అప్పలబత్తుల సోమరాజు అన్నారు .

# మొక్కలు నాటండి పర్యవరణాన్ని కాపాడండి



అనకాపల్లి .... ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యవరణం పరిరక్షణ ను కాపాడాలని కాలుష్యాన్ని అరికట్టాలని, జీవిఎంసీ జోనల్ కమీషనర్ బి. రాము అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సంకల్ప సొసైటీ ఆద్వర్యంలో పలు చోట్ల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జోనల్ కమీషనర్ రాము ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంకల్ప స్వచ్ఛభారత్ జోనల్ కో ఆర్డీనేటర్స్ జి. దేవి, ఎం. సుగుణ, సంకల్ప అధ్యక్ష, కార్యదర్శులు మళ్ల నాగభూషణ్, బి. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# 31వ వార్డులో రంజాన్ వేడుకలు



విశాఖ సిటీః ముస్లిం సోదరుల ప్రధాన పండుగ అయిన రంజాన్ సందడి జిల్లా వ్యాప్తంగా నెలకొంది. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసే ముస్లింలు బుధవారం ఘనంగా రంజాన్ పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా విశాఖ పరిధి 31వ వార్డు రైల్వే న్యూకాలనీలోగల మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం సోదరులందరూ కొత్త దుస్తులు ధరించి ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో యువకులు, చిన్నారులు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పరస్పరం శుభాభినందనలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నూర్ అహ్మద్, అబ్దుల్ గఫార్, అంజుమన్ గౌస్, ప్రెసిడెంట్, సెక్రటరీ సభ్యులు జుబేరు, హైదర్ ఆలీ సింకా, అహ్మద్, పిఆర్‌వో వలీ తదితరులు పాల్గొన్నారు.





Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com